ప్రమాద నివారణ చర్యలేవీ.?

- నివాసాలు, చెట్లను తాకుతున్న విద్యుత్ వైర్లు
- నెల రోజుల్లో ఐదు సంఘటనలు
- పట్టించుకోని అధికారులు



వేలాడుతున్న విద్యుత్ తీగలు



విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలను తొలగిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: విద్యుత్ తీగలు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. వరుసగా ప్రమాదాలు జరుగుతున్న అధికారులు నిద్రమత్తును వీడడం లేదు. ఫలితంగా నెల రోజుల వ్యవధిలో ఐదు సంఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లూజువైర్లను సరిచేయాలని ప్రజలు చేస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి.

మండలంలోని 24 గ్రామాల్లో విద్యుత్‌పరంగా ఆనేక సమస్యలు ఉన్నాయి. ఇటీవల నూతన సెస్ పాలకవర్గం ఎన్నిక కావడంతో ప్రజలు ఇక విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని కోటి ఆశలతో ఉన్నారు. సెస్ అధికారులు సమస్యలను గుర్తించి లూజు వైర్లను సరిచేయడమే కాకుండా నివాసాలు, చెట్లను తాకుతున్న వైర్లను తొలగించి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా శిథిలావస్థలో ఉన్న స్తంభాలను ఏర్పాటు చేయాలి.

నెల రోజుల్లో ఐదు సంఘటనలు

మండలంలోని సింగారం, కిస్టు నాయక్ తండా, కిషన్‌దాస్‌పేట, దుమాల, రాచర్ల బొప్పాపూర్ గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు వరుసగా చోటు చేసుకున్నాయి.

➡ కిషన్‌దాస్ పేటలో కిందికి వేలాడుతున్న లూజు వైర్లతో చేకూటి రాజు అనే రైతుకు చెందిన పశుగ్రాసం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది.

➡ కిష్టునాయక్ తండాలో ఓ ఇంట్లో ఉన్న వైర్లను సరిచేయని కారణంగా షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెంది రూ.80 వేల నగదులో పాటు రూ.1.50 లక్షల విలువ చేసే 80 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోయింది.

➡ దుమాలలో లూస్ వైర్లు ఇంటిని తాకడంతో ఇంటిపైన బట్టలు ఆరవేస్తున్న ఓ మహిళ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది.

➡ రాజన్నపేటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాక్టర్ దగ్ధం కావడంతో ఆ రైతుకు అపార నష్టం వాటిల్లింది.

➡ తాజాగా సింగారంలో విద్యుత్ వైర్లపై చెట్టు విరిగిపడిన కారణంగా పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తులు ప్రాణాలు బిగపట్టుకొని పరుగులు తీశారు. ఇలా వరస సంఘటనలతో మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పట్టింపు లేని అధికారులు

విద్యుత్ పరంగా గ్రామాల్లో అనేక సమస్యలు చోటుచేసుకుంటున్నప్పటికీ అధికారులు సిబ్బందికి పట్టింపు లేకుండా పోయింది. దశాబ్దాల కాలంగా తండాలు, గ్రామాల్లో విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్న వాటిని సరి చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో వ్యవసాయ మోటార్లు ఇతర చోట్ల కనీసం ఫీజు వైర్లు వేసేవారు లేక రైతులు ఫీజులను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదాలకు లోనవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కార మార్గం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గ్రామాల్లో విద్యుత్‌పరంగా ఉన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలి. ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ప్రాణాలు పోతే దానికి బాధ్యులు ఎవరు. విద్యుత్ సమస్యలపై మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుపోతాం.

– బంధారపు బాల్ రెడ్డి,రైతు, ఎల్లారెడ్డిపేట

లూజు వైర్లను సరిచేస్తాం



గ్రామాల్లో విద్యుత్‌పరంగా ఉన్న సమస్యలను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రధానంగా లూజ్ వైర్లను మరమ్మతు చేస్తాం. శిథిలావస్థలో ఉన్న స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బంది ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి.

– దివ్య, సెస్ ఏఈ, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

వంతెనపై 'హై టెన్షన్ విద్యుత్ వైర్లు' తొలగింపు



వంతెనపై విద్యుత్ వైర్లు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి: మండల కేంద్రం నుంచి లక్ష్మీపూర్ మీదుగా ఇల్లంతకుంట వెళ్లే ప్రయాణికులు సంద్రవాగు వంతెన మీదుగా 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలుపుతూ శనివారం 'బ్రిడ్జిపై ప్రయాణం.. హై'టెన్షన్' ' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు వంతెన పైనుంచి 33 కేవీ విద్యుత్ తీగలను సోమవారం తొలగించారు. కథనం ప్రచురించిన 'సాక్షి'కి ప్రయాణికులు, లక్ష్మీపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ల చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్శరాం, మాజీ ఎంపీటీసీ దొంతి మల్లయ్య, రమేశ్, నరేశ్, పర్శరాం, ఎల్లయ్య, పర్శరాం, రాజు పాల్గొన్నారు.

'టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి కృషి చేస్తా'



సెస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న టెక్స్‌టైల్ పార్కు యజమానులు

తంగళ్లపల్లి: టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి అన్ని రకాలుగా తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండలంలోని బద్దెనపల్లి-సారంపల్లి టెక్స్‌టైల్ పార్కు యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు అడ్మినిస్ట్రేటర్ డీడీ అశోక్‌రావు, డీవో ముజాహిద్, అధ్యక్షుడు అన్నల్దాస్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంకారపు కిరణ్, కోశాధికారి యెల్లె లక్ష్మీనారయణ, ఏముల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బొద్దుల వేణుప్రసాద్, ఆడెపు సూర్య, మొండయ్య, యూనిట్ యజమానులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న టెస్కాబ్ చైర్మన్

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ మోతె రాజిరెడ్డి, ఎంపీటీసీ పర్శరాములు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ప్రతిభ

వేములవాడ: వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు ఈనెల 12న జరిగిన సిరిసిల్లలో జరిగిన జ్ఞాన పరీక్ష టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరచి మొదటి, రెండవ, మూడవ, ఏడవ స్థానాలను గెలుచుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ దరక్షన్ వస్పియా, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కంటి వెలుగు ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఇటుకల నవీనరాజు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ కరాటే విజేతలకు అభినందనలు



అభినందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లఅర్బన్: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించిన విద్యార్థులను ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం అభినందించారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కుమితే విభాగంలో ఎండి అప్సర్, ఏ. హరిహరన్, మణిదీప్ బంగారు పతకాలు సాధించగా, జూనియర్ విభాగంలో వశిష్ట, పవన్‌రాజ్, వివేక్, అమిత్, యశ్వంత్, షాహిద్, శశిర్‌వివేక్, కాంస్య పతకాలు సాధించారు. కటా, కుమ్మితే విభాగంలో మాన్యస్విని, సుమేరా వెండి పతకాలు సాధించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ కరాటే-డో అసోసియేషన్ అబ్దుల్ మన్నాన్ ఉన్నారు.

'కుంగ్ ఫూ' శిక్షణ ప్రారంభం



శిక్షణలో విద్యార్థినిలు

సిరిసిల్లఎడ్యుకేషన్: స్థానిక నెహ్రూనగర్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం కుంగ్‌ఫూ శిక్షణ ప్రారంభించారు. వారంలో మూడు రోజులు బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహణ ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎనుగంటి అనురాధ తెలిపారు. బాలికలు మానసికంగా శారీరకంగా దృఢంగా ఎదగాలంటే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో తోడ్పడతాయన్నారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో అనుకోకుండా ఎదురయ్యే సమస్యలను సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే నైపుణ్యాలను ఇప్పటి నుంచే నేర్చుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. విద్యార్థినిలకు వడ్నాల శ్రీనివాస్ శిక్షణ ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కొలుగూరి రజిత , ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనుల పరిశీలన



వంటగది పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లెలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రమాదేవి సోమవారం పరిశీలించారు. కూలీలకు చేతినిండా పనులు కల్పించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో పారిశుధ్య చర్యలు, హరితహారం మొక్కల సంరక్షణలో పంచాయతీ పనితీరు బాగుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న కిచెన్ షెడ్డును పరిశీలించి, పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. సర్పంచ్ రవీందర్‌రెడ్డి, కార్యదర్శి రత్నకుమారి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ఇల్లంతకుంట: మండలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణా రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టే 9 అంశాలపై చర్చించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మీర్జా, ఎంపీటీసీ వొగ్గు నర్సయ్య యాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: జిల్లాలో పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సోమవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన సిరిసిల్ల మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతిని, అనారోగ్యానికి గురై సర్జరీ చేసుకున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిలివేరి సంజీవ్‌ను , వారం రోజుల క్రితం మరణించిన ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన వరుస బాలయ్య కుటుంబ సభ్యులను సోమవారం అనంతరం ఎంపీపీ పడిగెల మానస, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సింగిల్ విండో చైర్మన్ కోదూరి భాస్కర్ గౌడ్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు కొమ్మిటి రాజిరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ పబ్బతి విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులను చదివిస్తున్న ఎంఈవో

చందుర్తి: స్థానిక ప్రాథమిక పాఠశాల రికార్డులను ఎంఈవో శ్రీనివాస్‌దీక్షితులు సోమవారం తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను చదివించడం, రాయించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు ఉపాధ్యాయులు చేసే బోధనను స్వయంగా పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు వికృర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోచమ్మ తల్లికి బోనాలు

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవంగా భావించే శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. సిద్దోగం మొదటి రోజున గౌడ కులస్తులు పోచమ్మతల్లికి ఇంటికో బోనాన్ని తీసి భారీ ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుర్రం మధు, బొడిగే అనిల్ , కత్తి రాజు, దేవయ్య, రాజశేఖర్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

చిత్రకథ



నీళ్లు లేని తొట్టీలు

వేములవాడరూరల్: గ్రామ శివారులో మూగజీవుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టీలు నిష్ప్రయోజనంగా మారాయి. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన నీటి తొట్టీలు నీరు లేక నిరుపయోగంగానే మారాయి. ఇందుకు ఉదాహరణే మండలంలోని నాగాయపల్లి గ్రామంలో ఉన్న నీటి తొట్టి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ పాలకవర్గం వీటిపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్ కుమార్



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

వీర్నపల్లి: విద్యాలయాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వీర్నపల్లి మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ ఏబీవీపీ ఆధ్వర్యంలో సందర్శించారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు టాయిలెట్స్ సరిపోక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. కేజీబీవీకి ప్రహరీ నిర్మించాలని కోరారు. మండలంలో కొన్ని పాఠశాలలో ప్రహరీ లేదని, పరిశుభ్రత పనులు చేసే స్వీపర్స్ లేరని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనయుని నియోజకవర్గంలో ఇలాంటి సమస్యలుంటే ఇక రాష్ట్రంలోని వసతి గృహాలు, విద్యాలయాల్లో సమస్యలు ఏ స్థాయిలో ఉంటాయో గ్రహించాలన్నారు. ఇప్పటికైనా పాలకులు విద్యాలయాలపై చిత్తశుద్ధితో వసతులు కల్పించాలని లేనిపక్షంలో నిరసనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు, వంశీ గణేశ్, అశోక్, అనిల్, రాకేశ్, అజయ్, షబ్బీర్, సాయికుమార్, వంశీ, నవీన్ పాల్గొన్నారు.

సొమ్మొకరిది.. సోకొకరిది



మాట్లాడుతున్న ఎంపీపీ మల్లేశం

వేములవాడరూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం రంగులు చూపి ప్రచారం చేసుకుంటుందని వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ అన్నారు. మండలంలోని నూకలమర్రి గ్రామంలో రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర పథకాలను తామే అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. అలాంటి వారికి బుద్ధి చెప్పేందుకు బీజేపీ ప్రతి కార్యకర్త కేంద్ర పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేసీఆర్ కుటుంబాలు జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుందని, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేది బీజేపీ పార్టీయేనని అన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి సామోజి గౌతమ్, బూత్ అధ్యక్షుడు ఉప్పుల గౌతమ్, లింగంపల్లి కిషోర్, ఆవునూరి తిరుపతి, సంటి మహేష్, వంశీ, పర్శరాం, మహిళలు, పాల్గొన్నారు.

రంజాన్ గిఫ్ట్ ఆర్డర్లు తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాల మాక్స్ సంఘాలు అధ్యక్షులు, ఎస్ఎస్ఐ యూనిట్ యజమానులు రంజాన్ 2023 గిఫ్ట్ ప్యాక్ ఆర్డర్లను తీసుకోవాలని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. టెస్కో హైదరాబాద్ ఆధ్వర్యంలోని రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లకు అవసరమగు రోటోగ్రే వస్త్రం పీపీ ఆర్డర్‌ని మ్యాక్స్ సంఘాలకు 8,525 మీటర్లు, ఎస్ఎస్ఐ యూనిట్లకు 3,050 మీటర్ల చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించి ఆర్డర్ కాపీలను తీసుకొని వస్త్రాల తయారీని ప్రారంభించాలని ఆయన తెలిపారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి సబ్ స్టేషన్ 33, 11 కేవీలో నేడు మంగళవారం మరమ్మత్తుల పనులు ఉండటంతో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని నాంపల్లి, కొడుముంజ, అనుపురం, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందాని వేములవాడ సెస్ అధికారులు తెలిపారు.

సమాచారం

నేడు మండల సర్వ సభ్య సమావేశం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఎంపీపీ శరత్‌రావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు ఏఎంసీ సమావేశం

వేములవాడరూరల్: వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. గత నెలలో జరిగిన సమావేశంలో చేసిన తీర్మానాల ఆమోదం, 2022-23 సంవత్సరం గల ఆదాయ, వ్యయాలను ఆమోదించుటతో పాటు చైర్మన్ అనుమతితో ఇతర అంశాలు చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, పాలకవర్గసభ్యులు హాజరు అవుతున్నట్లు తెలిపారు.

నియామకం

బీఆర్ఎస్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ కార్యవర్గం

గంభీరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బీఆర్ఎస్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాపగారి అక్షయ్, ఉపాధ్యక్షులుగా భాను, శిరీష, కార్యదర్శులుగా నర్మాల భరత్, వెన్నెల, కార్యవర్గసభ్యులుగా రచన, అరవింద్, మనోజ్, వెంకటేశ్, అక్షిత, గణేశ్వరి, సాయితేజ ఎన్నుకున్నట్లు బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి ఎడబోయిన రత్నాకర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- రూ.1.79 లక్షలు మాయం

చందుర్తి: దుర్గమ్మకు మొక్కులు చెల్లించేందుకు తాళం వేసి వెళ్లగా.. అదే అవకాశంగా ఇంట్లో చొరబడ్డ దొంగలు నగదు ఎత్తుకెళ్లారు. కోనరావుపేటకు చెందిన కస్తూరి రాజేందర్‌రెడ్డి పొలం వద్ద నెలకొల్పుకున్న దుర్గమ్మకు బోనాలు తీసేందుకు కుటుంబ సభ్యుల సమేతంగా వెళ్లారు. మొక్కులు చెల్లించుకుని అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వచ్చి చూసే సరికి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచుకున్న రూ.1.79లక్షలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. పోలీసులు ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలించి వెళ్లారు. కాగా తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ దివ్యాంగుడు మృతి

ముస్తాబాద్: కూలీ పనులకు వెళ్లి వస్తూ.. కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డ లోకం వెంకటేశ్ అనే దివ్యాంగుడు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పోలియోతో ఎడమ చేయి కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో ఒంటి చెత్తో కూలీ పనులు చేసేవాడు. శనివారం పెంజర్ల పవన్ (18)తో కలిసి కూలీ పనులకు వెళ్లి సాయంత్రం బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, వెంకయ్యకుంట వద్ద సిద్దిపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడ్డ వెంకటేశ్, పవన్‌ను పోలీసులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్ మృతి చెందాడు. వెంకటేశ్ తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్ శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై శేఖర్ మాట్లాడుతూ వారి వద్ద రూ.1,510 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.